# సంపదవనం పరిశీలన



సంపద వనాన్ని సందర్శిస్తున్న పంచాయతీ రాజ్ కమిషనర్ హన్మంత్‌రావు

సోన్, అక్టోబర్ 4 : నిర్మల్ జిల్లా సోన్ మండలం సాకెర గ్రామంలో నిర్మించిన సంపద వనాన్ని బుధవారం రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ హన్మంత్‌రావు సందర్శించారు. సంపద వనంలో ఎన్ని మొక్కలు, ఏ రకాల పండ్ల మొక్కలు నాటారు సంబంధిత శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట జడ్పీసీఈవో సుధీర్‌కుమార్, ఉద్యానవన శాఖ అధికారి రాథోడ్ శ్యాంరావ్, డిప్యూటీ సీఈవో శంకర్, తదితరులు ఉన్నారు.

### నిర్మల్‌లో ఘన స్వాగతం...

నిర్మల్ పర్యటనకు పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ హన్మంత్‌రావు రాగా జిల్లా అధికారులు ఘన స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో జడ్పీ సీఈవో సుధీర్‌కుమార్, ఉద్యానవన శాఖ అధికారి రాథోడ్ శ్యాంరావ్, డీఆర్డీవో విజయలక్ష్మి, డిప్యూటీ సీఈవో శంకర్, జడ్పీ సూపర్‌వైజర్ నారాయణ ఉన్నారు.

### ఆయిల్‌పామ్ రైతులకు యూనిక్ ఐడీ కార్డుల పంపిణీ

ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి వచ్చిన సందర్భంగా పంచాయతీ రాజ్ కమిషనర్ హన్మంత్‌రావు ఆయిల్‌పామ్ పంటను సాగు చేస్తున్న రైతులకు యూనిక్ ఐడీ కార్డులు పంపిణీ చేశారు. సుమారు 150 మంది రైతులకు కార్డులు పంపిణీ చేసి ఆయిల్‌పామ్ మొక్కల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందన్నారు. అత్యధిక విస్తీర్ణంలో సాగు చేసిన రైతులను అభినందించి సన్మానించారు. అదే విధంగా ప్రీయూనికల్ కంపెనీ ప్రతినిధులతో పరిచయ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి ఫొటోస్టేషన్‌ను నిర్వహించారు.

# తుది ఓటరు జాబితా విడుదల

- ఆదిలాబాద్ జిల్లాలో 4,42,438 మంది ఓటర్లు
- మహిళా ఓటర్లు అధికం
- ఆదిలాబాద్‌లో 2,35,748, బోథ్‌లో 2,06,690 మంది ఓటర్లు

ఆదిలాబాద్, అక్టోబరు 4 (నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో తుది ఓటర్ల జాబితాను బుధవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ విడుదల చేశారు. జిల్లాలో ఆదిలాబాద్, బోథ్ అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. జిల్లాలో మొత్తం 4,42,438 మంది ఓటర్లు ఉండగా వీరిలో పురుషులు 2,16,491 మంది, మహిళలు 2,25,939 మంది, ఇతరులు ఎనిమిది మంది ఉన్నారు. పురుషుల కంటే మహిళా ఓటర్లు 9448 మంది ఎక్కువగా ఉన్నారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో మొత్తం ఓటర్ల సంఖ్య 2,35,748 ఉండగా వీరిలో పురుషులు 1,15,835 మంది, మహిళలు 1,19,908, ఇతరులు ఐదుగురు ఉన్నారు. బోథ్ నియోజకవర్గంలో మొత్తం 2,06,690 మంది ఓటర్లు ఉండగా వీరిలో పురుషులు 1,00,656, మహిళలు 1,06,031, ఇతరులు ముగ్గురు ఉన్నారు. వీరితో పాటు ఎన్నారై ఓటర్లు 12 మంది, ఇతరులు 771 మంది ఉన్నారు. విడుదల చేసిన తుది ఓటరు జాబితా జిల్లా ఎన్నికల కార్యాలయం, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి కార్యాలయాలతో పాటు బీఎల్‌వో వద్ద అందుబాటులో ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆగస్టు 21వ తేదీన ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేసింది. అక్టోబరు 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారికి ఓటు హక్కును కల్పించడంతో పాటు సెప్టెంబర్ 19 వరకు జాబితాపై అభ్యంతరాలు స్వీకరించారు.

### పెరిగిన ఓటర్ల సంఖ్య

ఎన్నికల సంఘం విడుదల చేసిన ముసాయిదా జాబితాలో జిల్లాలో 4,33,491 మంది ఓటర్లు ఉండగా సవరించిన జాబితాలో 4,42,438 మంది ఉన్నారు. కొత్త జాబితాలో 8,947 ఓటర్ల సంఖ్య పెరిగింది. ఆదిలాబాద్ నియోజకవర్గంలో 6733 మంది ఓటర్లు, బోథ్ నియోజకవర్గంలో 2214 మంది ఓటర్ల సంఖ్య పెరిగింది. కొత్త ఓటర్లు నమోదు, మార్పులు చేర్పుల కోసం అధికారులు జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

### నిర్మల్ జిల్లాలో 7,11,190 మంది ఓటర్లు

నిర్మల్ టౌన్, అక్టోబర్ 4 : నిర్మల్ జిల్లాలో ఓటర్ల ముసాయిదా జాబితాను అధికారికంగా ప్రకటించారు. జిల్లాలో ముథోల్, ఖానాపూర్, నిర్మల్ నియోజకవర్గాలు ఉన్నాయి. మొత్తం ఓటర్లు 7,11,190 మంది ఓటర్లుండగా అందులో మహిళా ఓటర్లు 3,66,683, పురుషులు 3,44,458, ఇతరులు 49 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు జాబితాను విడుదల చేశారు. ఈ నెల 19 వరకు 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు దరఖాస్తులు ఆహ్వానించారు. మార్పులు, చేర్పుల అనంతరం ఎలాంటి అభ్యంతరం లేని తుది జాబితాను రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రకటించినట్లు జిల్లా అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ తెలిపారు. పురుషుల కంటే మహిళలు 22,225 మంది అధికంగా ఉన్నట్లు జాబితాలో ప్రకటించారు. నిర్మల్ నియోజకవర్గంలో 306 పోలింగ్ స్టేషన్ల పరిధిలో 2,47,495 మంది ఓటర్లు ఉండగా అందులో మహిళలు 12,99,14, పురుషులు 11,75,63, ఇతరులు 18 మంది ఉన్నారు. ఖానాపూర్ నియోజకవర్గంలో 305 పోలింగ్ స్టేషన్ల పరిధిలో మొత్తం 21,76,65 ఓటర్లు ఉండగా మహిళలు 1,10,667, పురుషులు 1,06,985, ఇతరులు 13 మంది ఉన్నారు. ముథోల్ నియోజకవర్గంలో 311 పోలింగ్ స్టేషన్ల పరిధిలో 2,46,030 ఓటర్లుండగా ఇందులో పురుషులు 1,19,910, మహిళలు 1,26,102, ఇతరులు 18 మంది ఉన్నట్లు అధికారికంగా ప్రకటించారు. మండలాల వారీగా అర్బన్ జాబితాను అధికారికంగా ప్రకటించడంతో ఓటరు తుది జాబితా ఇదే కావడంతో దీని ద్వారానే ఎన్నికలు నిర్వహించనున్నారు.

# మాలేగాం మండల ఏర్పాటుపై సంబురాలు



మాలేగాంలో సీఎం, మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న ప్రజలు, నాయకులు

కుభీర్, అక్టోబర్ 4 : మాలేగాంను కొత్త మండలంగా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై మాలేగాంతో పాటు చుట్టూపక్కల గ్రామాల నాయకులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం మాలేగాం గ్రామంలో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో ర్యాలీ తీశారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేశారు. కొత్త మండలంగా మాలేగాంను ఏర్పాటు చేయడంతో ఎల్లప్పుడు సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ముందుగా జీపీలో పాలాభిషేకం ముగించుకొని ర్యాలీగా ప్రధాన రహదారి గుండా శివాలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ రేకుల గంగాచరణ్, సర్పంచ్ మహిపాల్, మాజీ సర్పంచ్ శంకర్, కోఆప్షన్ సభ్యుడు దత్తహరి, బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు సాయిప్రసాద్‌రెడ్డి, రమేశ్, దిగంబర్ పటేల్, గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

తలమడుగు, అక్టోబర్ 4 : ఆదిలాబాద్ జిల్లా తలమడుగుకు చెందిన పలువురు యువకులు, రైతులు బుధవారం నేరడిగొండలో బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి జాదవ్ అనిల్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ వెంకటేశ్, జిల్లా నాయకులు కాటిపెల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీ చంటి, రైతుబంధు సమితి అధ్యక్షుడు జీవన్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన యువకులతో బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి జాదవ్ అనిల్

## నీలాదేవిని సన్మానించిన మంత్రి



నీలాదేవిని సన్మానిస్తున్న మంత్రి హరీశ్‌రావు

ఇచ్చోడ, అక్టోబర్ 4 : హైదరాబాద్‌లోని కమిషన్ కార్యాలయంలో రెండోసారి నియమితులైన రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ పాలకవర్గ సభ్యురాలు కుడ్రం నీలాదేవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మంత్రులు జగదీశ్ రెడ్డి, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి, ప్రభుత్వ విప్, టీఎస్ఎంఎస్ఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్, కార్పొరేషన్ చైర్మన్లు పల్లె రవికుమార్, రాంచంద్ర నాయక్, వల్యా నాయక్ పాల్గొని నీలాదేవికి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## పకడ్బందీగా పత్తి కొనుగోళ్లు

నిర్మల్ టౌన్, అక్టోబర్ 4 : నిర్మల్ జిల్లాలో పత్తి కొనుగోళ్లను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా మార్కెటింగ్ అధికారి అశ్వక్ అహ్మద్ అన్నారు. బుధవారం మార్కెటింగ్ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వానకాలం సీజన్‌లో సాగు చేసిన పత్తి రైతుల చేతికి వస్తున్న నేపథ్యంలో సీసీఐ ద్వారా కొనుగోళ్లు చేపట్టేందుకు కార్యాచరణను రూపొందించామన్నారు. పత్తికి ప్రభుత్వం మద్దతు ధర క్వింటాల్‌కు రూ. 7020 ప్రకటించిన నేపథ్యంలో విక్రయించుకునే వారు తమ ఆధార్ ప్రామాణీకరణ చేసుకోవాలని సూచించారు. ఆధార్ ప్రామాణీకరణ కోసం పత్తి కొనుగోలు కేంద్రంలో అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. వేలిముద్ర ద్వారా ప్రామాణీకరణ చేస్తామన్నారు. అదేవిదంగా ఐరిష్ విధానంలో కూడా ప్రామాణీకరణ చేసుకోవాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కొనుగోలు కేంద్రంలో బ్యాంకు ఖాతా, పాన్‌కార్డు, పాస్‌ఫొటో, ఓటరు గుర్తింపు కార్డు, లైసెన్స్, గెజిటెడ్ ఆఫీసర్ జారీ చేసిన ఫొటో ఐడెంటీ కార్డు ఉంటెనే ప్రామాణీకరణ చేయడం జరుగుతుందన్నారు. దసరా తర్వాత పత్తి కొనుగోళ్లను చేపట్టేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని రైతులు ప్రైవేట్ వ్యాపారులకు ఆశ్రయించి నష్టపోవద్దన్నారు. ఆధార్‌కార్డు అనుసంధానం చేయని పత్తి రైతులు ఉంటే కొనుగోళ్లు తిరస్కరించబడుతాయని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## పేదలకు బీఆర్‌ఎస్ పథకాలు అండ



చీరెలు పంపిణీ చేస్తున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్ రూరల్, అక్టోబర్ 4 : సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేద కుటుంబాలకు అండగా నిలుస్తున్నాయని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. బుధవారం ఆదిలాబాద్ రూరల్ మండలానికి చెందిన మహిళలకు ఎంపీడీవో కార్యాలయంలో ఎమ్మెల్యే జోగు రామన్న బతుకమ్మ చీరెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకమ్మ పండుగ మహిళల ఆత్మ గౌరవమని కొనియాడారు. మహిళల ఆత్మగౌరవ నిలిపేలా పోడు భూముల పట్టాలు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, అమ్మఒడి, కేసీఆర్ కిట్, ఆరోగ్యలక్ష్మి, డబుల్ బెడ్రూం, వితంతువు పింఛన్లు, వంటి మహోన్నత పథకాలు అమమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్‌ఎస్ ప్రభుత్వమని కొనియాడారు. మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

## రాజకీయ పార్టీల నేతలతో సమావేశం

ఎదులాపురం, అక్టోబర్ 4 : జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అధ్యక్షతన బుధవారం ఆదిలాబాద్ నియోజకవర్గ రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. కొత్తగా నమోదైన ఓటర్ల వివరాలు, పబ్లిష్ చేసిన ఓటరు జాబితా గుర్తింపు పొందిన పార్టీల ప్రతినిధులకు సీడీ రూపంలో అందజేశారు. సమావేశంలో ఆర్డీవో స్రవంతి, తహసీల్దార్లు, ఎన్నికల సిబ్బంది, రాజకీయ పార్టీల నాయకులు సుభాష్, శివకుమార్, రాము, ప్రశాంత్, రోహిత్, రాహుల్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.




రాజకీయ పార్టీల నేతలతో మట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్యామలాదేవి